కథానిక

# తెలివితక్కువ పోస్టుమన్

మొవ్వ రాంబాబు

మరాపేట నాయుడుగారు అనేకమైన కథలు చెప్పగలరు. తీరిగ్గా కూర్చుని వినేవారుంటేసరి నాయుడుగారు విసుగూ విరామం లేకుండా చెప్పగలరు. మనం కష్టపడకుండా, సొమ్ము నష్టపడకుండా 'ఊరకనే' అనేక ఉత్తమమైన కథలు వినవచ్చును. సొమ్ము నష్టపడకుండా అని ఎందుకు అనవలసి వచ్చిందంటే మనకు కథల పుస్తకాలు ఇంగ్లీషులో సోమర్‌సెట్ మాఘమ్‌గాని, ఓ హెన్రీలుగాని, మళ్ళా తెలుగులో చలం, కుటుంబరావు, గోపీచంద్, భారద్వాజ మొదలైన మహా రచయితల కథలు గాని చదువవలెనంటే కనీసం రూపాయి మొదలు పది రూపాయలవరకు డబ్బు వెచ్చించవలసి వస్తుంది. నాయుడుగారు డబ్బు ఒక్క దమ్మిడీకూడా పుచ్చుకోకుండా (వారివద్ద చిల్లర లేనిపక్షంలో మనచేత ఒక అణా ముక్కుపొడుము తెప్పిస్తుంటారు మన డబ్బుతో) అనేకమయిన కథలను ఈ మామూలు రచయితలు చెప్పగలవాటికన్నా అన్ని విధాలా గొప్పవి చెప్పగలరు. నాయుడుగారు ఏమైనా ఇతర పుస్తకాలు చదివి చెప్తూతారా అంటే వారికి తెలుగు సరిగ్గా రాదు. మరి వారికి ఈ మహోజ్జ్వమయిన విశిష్టత ఎట్లా ఏర్పడిందా అని నాకు సందేహం వేస్తుంది. గొప్పగొప్ప రచయితలు చెప్పే వాటికి వీరివి ఏ విధంగాను తీసిపోవు. కాగా వారు చెప్పే ఈ కథలు వారు స్వయంగా అనుభవించినవి కావు. కొంచెం బుద్ధిఉపయోగించి చూస్తూంటే చాలు మనకు అనేకమయిన విషయాలు తెలుస్తుంటవని అనేకమార్లు అంటూంటాడు. ఏమైనప్పటికీ వారు చెప్పే కథలలో, వారు చెప్పే తీరులో ఒక ప్రత్యేకత మనకు గోచరిస్తుంది. మనం అర్థం చేసుకోకలిగామంటే విజ్ఞానవంతంగాను సహజంగాను కనుబడతవి.

ఆరోజు మధ్యాహ్నం నేను కాలేజీకి పోలేదు. క్లబ్బులో నాయుడుగారు కనుపించారు. ఇద్దరం ఒక మూలచేరాం మాట్లాడుకుంటూ. నాయుడిగారికి ఉబ్బసం వ్యాధి. అది నయంకాదు. మనిషిని చావనీయదు. అంటే ఒక్కతడవ చంపివేయదు. నాయుడిగారిని ఏ ఒక్క గట్టి పనీ చేయనీయదు.

"ఏం నాయుడుగారు ఏమైనా విశేషాలా?" అడిగాను.

"ఏవీూ లేవోయ్!... నీ కిది చెప్పి ఉంటూనా?" అన్నారు.

"ఏదీ! నాకు చెప్పలేదే" అన్నాను.

"మన వార్డు పోస్టుమన్ సంగతీ? భలేవాడివే నీకు ఇంకా తెలియనే తెలియదన్న మాట. అయితే విను", అని మొదలుపెట్టాడు, పాతకుల సాకర్యార్థం కథని నేనుగా వర్ణిస్తాను.

* * *

"పోస్టుమాన్ మాకేమన్నా ఉత్తరమా?" అని ఆడగొంతు ధృఢంగా వినపడేటప్పటికి పోస్టుమన్ వెంకటేశ్వర్లు ఆగవలసి వచ్చింది. వెనక్కి తిరిగి చూచాడు ఆమెకి సమాధానం ఇవ్వటానికి. ఆమె ఎవరో ఒక అపరిచిత వ్యక్తి. ఆమె అతడు నిదానించటం చూచి తన పేరు, విలాసం, చెప్పేటప్పటికి నవ్వుకుంటూ వెంకటేశ్వర్లు ఒక కవరు తీసి ఇచ్చాడు ఆమె ముఖంలోనికి చూచి నవ్వుతూ. ఆమె కూడా ఆదే అడ్రసుతో వచ్చే ఉత్తరాలు, తనకి అందచేయవలసిందని చెప్పి పోస్టుమన్‌కి అభివందనం తెలిపి ఇంట్లోకి వెళ్ళింది. వెంకటేశ్వర్లుకి ఇది అంతా విచిత్రంగా ఉన్నది. ఆ యింట్లోకి ఆమె ఎప్పుడు వచ్చింది? ముఖ్యంగా ఆ ఈడులో యువతిని చూస్తే అందరికీ కలిగే సహజమయిన ఆలోచనలే అతనికీ కలగినవి. ఆమె సంగతి తెలుసుకోవాలని వెంకటే

శ్వర్లుకి కుతూహలం కలిగింది. మరుసటిరోజు ఆమెకి ఉత్తరం లేకపోయినా ఆ ఇంటి ముందు ఆగాడు. "చూడండి. ఈ అడ్రసు ఇల్లు ఎక్కడో చెప్పగలరా?" అని అడిగాడు ఒక ఉత్తరాన్ని చూపిస్తూ. ఆమె తనకి తెలియదని తల ఊపింది.

"మీరు ఈ ప్రదేశానికి కొత్తల్లే ఉన్నారే?"

"అవును" ఆమె అన్నది.

"మీరు ఎక్కడనుంచి వచ్చారు?"

ఆమె దగ్గర పల్లెటూరు పేరు చెప్పింది.

"మీరు ఇక్కడ ఒంటరిగానే ఉంటున్నారా?"

"తల్లి తండ్రులతో..."

అతడు ఎంత ఉత్సాహంగా సంభాషణని పెంచాలనుకుంటున్నాడో ఆమె అంత తక్కువ సమాధానాలు ఇవ్వటం అతన్ని సంతుష్టి పరచలేదు.

వెంకటేశ్వర్లు మంచిచలాకీ యువకుడు. తను నవ్వుతూంటాడు. అందరినీ నవ్విస్తుంటాడు. వాళ్ళ ఆఫీసుస్టాఫు మొత్తంలోనికి చిన్నవాడు. వెంకటేశ్వర్లు పొడుగు మనిషి. గుండ్రటి మొఖం. మొఖంమీద అక్కడక్కడ స్ఫోటకంమచ్చలు. స్వచ్ఛమైన తెల్లని పండ్లవరస వలన అతని చిన్ననోరు అందంగా ఉంటుంది. మళ్ళా ఒకరోజున ఆమెను,

"మీరేమి చేస్తూంటారు?" అని అడిగాడు.

"టైపు షార్టుహేండ్ నేర్చుకుంటున్నానని" ఆమె అన్నది.

ఈ విధంగా వారిద్దరిమధ్య సంభాషణ సాగిపోతూంది. రోజులు సాగిపోతున్న కొద్దీ వారిద్దరి స్నేహితం వృద్ధిచెందింది. ఆమెని తరచు సినిమాలకీ, నాటకాలు ఉన్నప్పుడు నాటకాలకీ త్రిప్పటం మొదలుపెట్టాడు. ఆమె రోజూ సాయంత్రం తన ఇల్లువిడచి గల్లీ చివరకు వస్తుంది. వెంకటేశ్వర్లు అక్కడ ఆగిఉంటాడు. సినిమా విడువగానే ఆమెని మళ్లా మూలవరకు సాగనంపుతాడు. ఆమె నెమ్మదిగా నిశబ్దంగా తన ఇంటికి చేరుకుంటుంది. ఒక రోజున ఆమెని తన ఇంటికి రమ్మనమని కోరాడు. ఆమె నిరాకరించింది నెమ్మదిగా నవ్వుతూ. ఆమెకు తెలుసు అతనిని ఎంతదూరంలో ఉంచాలో. అతడు అంత చనువుగా ఉన్నా ఆమె అంత దూరంగా ఉండటం అతనికి నచ్చలేదు. కాగా అతడు కొన్నిపర్యాయాలు తన మనస్సుని కుదుటపరచుకొన్నాడు. ఆమె ఇంగ్లీషు కూడా చదువుకున్న ఆమె అయినందువలననూ, తనకన్నా విద్యాధికురాలు అవటంవలననూ, ఆమెను ఒక విధంగా గౌరవంగానే చూస్తున్నాడు. చదువుకున్న ఆడవాళ్ళందరూ అదే విధంగా ఆమెకి మల్లెనే ఉంటారా అని తనలో తాను ప్రశ్నించుకొని పెళ్ళి కానంతవరకూ ఆడవాళ్లు అందరూ మొగవాళ్ల వెంట తిరుగుతారని తనని తాను సమాధానపరచుకొన్నాడు. అందుకనే ఒక రోజున మాటల సందర్భంలో పెండ్లినిగురించి ఆమె ముందు ప్రస్తావించాడు. ఆమె ఏవిధంగాను ఆశ్చర్యపడలేదు. అతడు పెండ్లినిగురించి ప్రస్తావిస్తాడనే టటువంటి విషయాన్ని గ్రహించే శక్తి ఆమెలో లేకపోలేదు. అతనితో ఏమీ మాట్లాడకుండా ఇంటికి వెళ్ళిపోయింది.

వెంకటేశ్వర్లుకి భయంవేసింది, ఆమె తన మీద కోపంతో వెళ్ళిందేమోనని. తనని తాను అనేకం అనుకున్నాడు అంత తొందరలోనే యెందుకు ఆ విషయాన్ని గురించి మాట్లాడానా అని.

ఆమె ఆ రోజురాత్రి తను వెంకటేశ్వర్లుని పెండ్లి చేసుకుంటానని తల్లితండ్రులతో చెప్పింది. వాళ్లు ఆ మాట వినేటప్పటికి భగ్గుమన్నారు. వాళ్లు ఆమెమీద ఎన్నోఆశలు పెట్టుకున్నారు. ఆమెకి ఇంగ్లీషు చదువు నేర్పించి, ఒక్కటేకూతురు గదా అని ఆమె అభివృద్ధికి వీలు కలిగించారు. అటువంటి ఆమె ఇంటిఇంటికి తిరిగి ఉత్తరాలు జేగవేసే పోస్టుమన్‌ను పెండ్లి చేసుకోవటం వారికి భరింపరాని విషయం. ఎవరో ఒక ఆఫీసరో పెద్ద భూస్వామో తమ అల్లుడు అవుతాడనుకున్న వాళ్ళకు ఆమె పట్టుదల పెద్ద విఘాతాన్ని కలిగించింది. నయానా భయానా ఆమెకి చెప్పి చూశారు వెంకటేశ్వర్లుని పెండ్లి చేసుకోకూడదని.

"అయితే నీకు ఒక్కదమ్మిడీ ఆస్తిరాదు. ఈ ఆస్తి అంతా మీనాన్న కష్టపడి సంపాదించింది. కొట్లో పదిరూపాయల జీతగాడుగా

మొదలు పెట్టి ఈరోజుకి ఒకషాపు పెట్టకలిగాడు. నీవు వెంకటేశ్వర్లుని పెండ్లి చేసుకుంటే నీకు ఒక్క చిల్లిగవ్వకూడా రాదు. తరువాత నీ యిష్టం" అని ఆమెతల్లి అంది.

ఈ మాటలన్నీ వింటున్న ఆమె తండ్రి అందుకొని "అవును ఈ ఆస్తిఅంతా కష్టపడి సంపాదించాము. అది కాకపోయినా వెంకటేశ్వర్లు మనకి తగిన హోదా కలవాడుకాదు. పైగా అతనికి జీతం డబ్బులు తప్పితే ఇతర సంపాదనా ఆస్తి ఏమీలేదు. డబ్బు విలువ నాకు తెలుస్తుంది. డబ్బులేనట్టివాడిని పెండ్లి చేసుకోవటం భావ్యంకాదు" అని అన్నాడు నిదానంగా.

వాళ్లు ఎన్ని చెప్పినా ఆమె చెవిలో దూర లేదు. డబ్బు లేదన్న మాటకు తనుకూడా ఉద్యోగంచేసి సంపాదిస్తానన్నది. ఇద్దరి సంపాదన కలుపుకున్నట్లయితే జీవితం సుఖంగా గడుస్తుంది అని చెప్పింది.

"రేపు పిల్లలు పుడితే వాళ్ళకు ఏమి తెచ్చి పెడతావే" అని ఏడుస్తూ ఆమె తల్లి అడిగే టప్పటికి మాట్లాడ లేదు.

"ఆస్తిలో మాత్రం ఒక దమ్మిడీకూడా రాదు. అప్పుడుకాని తిక్క కుదరదు" అని వాళ్ళఅమ్మ అరిచేటప్పటికి "నేను మీ డబ్బుకి ఆశించటంలేదని చెప్పలేదూ?" అని గట్టిగా అన్నది.

"అయితే నిన్ను ఇంతవరకు చదువులూ ఇవిఅన్నీ చెప్పించింది ఎవరే?" అని ఆమెతల్లి అరచింది.


"నామీద ఖర్చుపెట్టిన ప్రతిదానికి తీరు స్తాను" అని ఆమె అంది.

"ఇన్నాళ్ళనుండి నిన్ను పెంచి చదువులు చెప్పిస్తే వాటిఅన్నింటికి తీరుస్తానని అంటావా? మీనాన్న కష్టపడి సంపాదించేది ఎవరికోసం కే?" అని తల్లి ఏడ్చింది. ఆమె తండ్రి ప్రక్కకు తిరిగాడు.

తల్లితండ్రులు చెప్పిచెప్పి చివరకు వాళ్ళే లొంగిపోయారు. ఇంకా రెండుమూడు నెలలకి పెండ్లి జరుగుతుంది అన్నప్పటినుంచీ వారు అన్నీ సిద్ధము చేయటం మొదలుపెట్టారు. వెంకటేశ్వర్లు ఉషారు చేయటం మొదలు పెట్టాడు. వాళ్ల ఇంటికి రోజూ వచ్చి వెళ్ళటం ఆమెని సినిమాలకు తీసుకొనివెళ్ళటం అన్నీ జరుగుతున్నవి.

కాని పెండ్లి ఇంకొక నెలరోజులకి జరుగుతుంది అనగా పోలీసులు వెంకటేశ్వర్లుని అరెస్టు చేసారు. పోస్టు మనిఆర్డర్లు కాజేసినట్లు నే ర ం మో ప బ డి, ఋ జు వు చే య బడింది. మరి లేకపోతే వెంకటేశ్వర్లు అట్లా జల్సాచేయటానికి ఎక్కడినుంచి వస్తవి? ఈ విషయం వినంగానే ఆమె తల్లితండ్రులు కృంగిపోయారు. తమకు కాబోయే అల్లుడు ఆ విధంగా దొంగగా ఋజువు చేయబడటం! ఇంక అప్పుడు ఆమెమనస్సు తిరుగుతుందేమో నని వారు అనుకున్నారు. ఆమెతల్లి ఆసంబంధం పూర్తిగా తెగిపోయినట్లే భావించింది. కాని ఆమె మాత్రం మాట్లాడలేదు. కోర్టులో విచారణనాడు కోర్టువద్దకు వెళ్ళింది. వెంకటేశ్వర్లు ఆమెని చూడటానికి సిగ్గుపడ్డాడు. తనలాంటి నీచుడిని ఆమె ఇంకా చూస్తుందా అని అనుకున్నాడు. కోర్టులో విచారణ జరిగేటంత వరకు ఆమె ఏమీ మాట్లాడలేదు. విచారణ అయి అతనికి సంవత్సరం ఆరుమాసాలు శిక్ష వేశారు. వెంకటేశ్వర్లు అపరాధాన్ని ఒప్పుకున్నందువలన కొద్దిలోనే పోయింది. విచారణ పూర్తికాగానే ఆమె అతని దగ్గరకు వెళ్ళింది. అతడు మాట్లాడబోయి తడబడ్డాడు.

"మీరు ఏమీ మాట్లాడ నవసరం లేదు. నాకు అంతా అర్థమయింది. నాకోరకు చేశారు



ఈ అపరాధాన్ని అంతా. సంతోషంగా గడిపి రండి. వెంటనే పెండ్లి చేసుకుందాం. మీరు వచ్చేటంతవరకూ నేను మీ కొరకు ఎదురు చూస్తూంటాను" అని అంది అతనివంకేచూస్తూ.

అతని కళ్లు మెరసిపోయినవి. తన్ను తానే నమ్మలేక పోయాడు. మెకానికల్‌గా తల ఊపాడు. ఆమె నెమ్మదిగా జైలునుండి బయటకు వచ్చింది.

ఈ అవమానం జరిగిన తర్వాత అయినా మాట్లాడకుండటం తల్లితండ్రులని మరింత బాధ పెట్టింది. ఇప్పటికే అవమానంతో చస్తున్నారు. ఆమెతల్లి నాయుడుగారి లాంటి పెద్దమనుష్యులు, ఇష్టులు నలుగురయిదుగురితో చెప్పి తన కూతురుని ఎట్లాగయినా మార్చమని కోరింది. సజ్జనుడు, పరసేవాతత్పరుడు అయిన నాయుడు గారు వెంటనే ఆ కార్యాన్ని తన భుజాన వేసుకొని ఆమెకి అనేకవిధాల చెప్పారు. స్త్రీ పురుషులన్నాక వాళ్ల ప్రేమలే కాకుండా ప్రపంచంలో పాటించవలసిన విషయాలు చాలా ఉన్నవనీ అందులో ముఖ్యంగా సంప్రదాయాలు, తల్లితండ్రుల గౌరవప్రవృత్తులు కూడా చూడవలయుననీ అనేకం చెప్పినా ఆమె పాటించలేదు. ఆమె తను ఆడినమాట తప్పననీ వెంకటేశ్వర్లును తప్ప ఇతర్లను పెండ్లిచేసుకొనుట జరగదనీ చెప్పేటప్పటికి నాయుడుగారి పవిత్రమయిన సంధిప్రయత్నం విఫలమయింది.

ఆమె ఒక చిన్న ప్రయివేటు కంపెనీలో టైపిస్టుగా చేరింది. తల్లితండ్రుల దగ్గరనుండి వేరుపడింది. వెంకటేశ్వర్లు వచ్చేలోపున జీతంలో సాధ్యమయినంత వరకూ మిగల్చాలని ప్రయత్నిస్తూంది. అప్పుడే రెండు గదుల ఇల్లు అద్దెకు తీసుకొని దానిలోనికి ఒక్కొక్కటే సామానులు చేకూర్చుకుంటూంది.

ఇంకొక రోజులో వెంకటేశ్వర్లు జెయిలు నుంచి బయటకు వస్తాడనగా ఆమె నాయుడు గారిని జైలువద్దకు పంపింది, అన్ని విషయాలు వివరించమని. నాయుడుగారు అన్ని విషయాలు చెప్పారు. ఆమె ఎట్లా వేరుపడి డబ్బు నిలవచేస్తున్నదీ. వెంకటేశ్వర్లు అన్ని విషయాలు సావధానంగా విన్నాడు.

"ఆమె తన ఇంట్లోనుండి వేరుపడిందా ?" వెంకటేశ్వర్లు అడిగాడు.

ఆమె వేరుపడి రైలుపేటలో ఇల్లు అద్దెకు తీసుకొందోయ్" అన్నారు నాయుడుగారు.

"ఆమె ఎంత సంపాదిస్తుంది ?" అడిగాడు.

"ఎంత సంపాదిస్తుంది? ఏదో మామూలు క్లర్కు జీతం" అని అన్నారు నాయుడుగారు సావధానంగా.

వెంకటేశ్వర్లు నుదురుముడిచి మొఖము చిట్లించి "ఆమెని నేను పెండ్లిచేసుకోలేనన్నానని చెప్పండి" అన్నాడు.

బాంబ్‌షెల్ పగిలింది. నాయుడుగారు నమ్మలేకపోయాడు. "ఏమిటి నీవు అంటున్నది? నీకొరకు ఆమె ఇంతచేస్తే నీవు ఇప్పుడు ఆమెని నిరాకరించటం."

"అపండిసార్! ఆమెని పెండ్లి చేసుకోవటం ముమ్మాటికీ జరగదని మీరుచెప్పండి. ఇంక వేరే విషయాలులేవు.శలవు"అని గదిలోనికి వెళ్ళాడు.

నాయుడిగారి నోటినుండి మాట రాలేదు. వెంకటేశ్వర్లుకి మతి చంచలనం జరిగిందేమో నని అనుకున్నాడుగాని అటువంటి దేమీలేదు.

నాయుడుగారు ఆమెకి వెంకటేశ్వర్లు అన్న మాటలన్నీ చెప్పాడు. ఆమె తెల్లబడిపోయింది. ఆమె ఏమీ మాట్లాడలేదు.

* * *

ఇదోయ్ జరిగిన కథ. వాడు ఆమెని ఎందుకు పెండ్లి చేసుకొనదలుచుకోలేదో నాకు అర్థం కాలేదోయ్!" అని అన్నారు నాయుడు.

"వాడిమొఖంలెండి? ఇంతకీ ఆమె ఏమి చేస్తూందంటారు?" అన్నాను.

ఆమె ఏమి చేస్తుంది? ఇంతవరకూ వచ్చినాక ఆమె ఏమిచేస్తుంది" అన్నాడు.

"నీళ్లులేని బావిలోకి దూకాలి" అన్నాను నవ్వుతూ ఆడవాళ్లమీద నాకున్న సహజమైన అపహాస్యంతో.

నాయుడుగారు మొఖం ఒకపక్కకు త్రిప్పుకొని అన్నారు.

"ఆమె నీళ్లు ఉన్న బావిలోకే దూకింది."